## కోడ్ విధిగా పాటించాల్సిందే

### కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, జనవరి 30 : శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు, వారికి మద్దతు ఇచ్చే పార్టీలు ఎన్నికల కోడ్‌ను విధిగా పాటించాల్సిందేనని కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, తదితర అంశాలపై గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నిర్వహించే ర్యాలీలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తేల్చి చెప్పారు. ప్రజలను ప్రభావితం చేసేలా ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడలపై రాతలు, చిత్రపటాలు తొలగించినట్లు వెల్లడించారు. అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు చేయాలనుకుంటే అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించే ఆర్డీవోలకు అందజేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలోని బెల్ట్ షాపులను మూసివేసినట్టు తెలిపారు. వాహనాల వినియోగానికి ఏఆర్వోల అనుమతి తప్పనిసరి అని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాలను నమోదు చేయనున్నట్లు చెప్పారు. మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్– కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి 15 జిల్లాలు, 35 డివిజన్లు, 271 మండలాలు ఉన్నాయని తెలిపారు. 499 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. డివిజన్లలో ఆర్డీవోలు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి 274 పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనుట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఉపాధి సిబ్బంది నిరసనలు

కలెక్టరేట్, జనవరి 30 : ఉపాధి హామీ సిబ్బంది నిరసనలు కొనసాగుతున్నాయి. వరుస ఆందోళనల్లో భాగంగా బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకాగా, రెండో రోజు గురువారం జిల్లాలోని పలు మండలాల్లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అలాగే, శుక్ర, శనివారాల్లో పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఉపాధి సిబ్బంది సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు తమకు పేస్కేలు అమలు చేసేలా ఉన్నతాధికారులకు లేఖలు రాయాలని మండల పరిషత్ అధికారులను కోరారు. ఉపాధి హామీ ఏపీవోలు, ఇంజినీర్ కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు కిందిస్థాయి సిబ్బంది కూడా నిరసనల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. వేతనాలు అందక తమ కుటుంబాలు పస్తులుంటున్నాయని, దీనిపై ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ నెల 12 వరకు వరుస నిరసనలు చేపట్టి, అనంతరం సమ్మె నోటీసు అందజేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2న ఉపాధి హామీ పథక ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులకు, 3న ఎమ్మెల్యేలకు, 4న కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తామని, 5న కలెక్టరేట్ ఎదుట శాంతియుత నిరసన చేపడతామన్నారు. 6న టీఎన్జీవోల సంఘం నేతలకు వినతిపత్రం ఇస్తామని చెప్పారు. 7న ప్రజాభవన్‌కు తరలివెళ్తామన్నారు. 8న పంచాయతీరాజ్ కమిషనర్‌కు, 9,10 తేదీల్లో మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. 11న పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన చేపడతామని, 12న కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేయనున్నట్లు స్పష్టం చేశారు.



కరీంనగర్: కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను ప్రదర్శించి నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# 420 హామీల పేరిట కాంగ్రెస్ మోసం



చొప్పదండి: గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు



కరీంనగర్: గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్సీ నారదాసు, జీవీఆర్

- సర్కారుపై బీఆర్ఎస్ ఆగ్రహ జ్వాల
- హామీల అమలు కోసం కేటీఆర్ పిలుపుతో నిరసనలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు వినతులు
- రేవంత్ సర్కారు వైఫల్యాలపై ఆగ్రహం
- అన్ని వర్గాలకూ వెన్నుపోటు పొడిచిందని ధ్వజం
- హామీలు నెరవేర్చే వరకు పోరాడుతామని హెచ్చరిక

హామీల అమలు కోసం బీఆర్ఎస్ దళం మరోసారి పోరుబాట పట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 420 రోజులు అవుతున్నా ఇచ్చిన 420 హామీలు అమలు చేయడం లేదని నిలదీసింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో గురువారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాయకులు నిరసనలు తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో ఆయన విగ్రహాలకు వినతి పత్రాలు అందించారు. కరీంనగర్‌లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో కోతిరాంపూర్‌లోని గాంధీ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతోపాటు మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు వినతిపత్రం అందించారు. మానకొండూర్‌లో మాజీ జడ్పీటీసీ సభ్యుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలోనూ జీవీఆర్ పాల్గొన్నారు. చొప్పదండిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. .

**- కరీంనగర్, జనవరి 30 (నమస్తే తెలంగాణ)**

## దద్దమ్మ కాంగ్రెస్‌కు దారి చూపించు..

### చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, జనవరి 30 : ''జాతిపిత మహాత్మాగాంధీకి.. శిరస్సు వంచి పాదాభివందనాలు.. ఓ మహాత్మా.. ఈ అసమర్థ ప్రభుత్వానికి కళ్లు తెరిపించు.. ఈ దద్దమ్మ కాంగ్రెస్‌కు దారి చూపించు.. ఈ చేతకాని సర్కారుకు బుద్ధి ప్రసాదించు.. ఈ అసమర్థ ముఖ్యమంత్రికి జ్ఞానోదయం కలిగించు.. 420 హామీలు.. 420 రోజులైనా నెరవేరక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. వాటిని నెరవేర్చేలా చూడాలి'' అని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మహాత్మా గాంధీని వేడుకున్నారు. చొప్పదండిలో ఆయన స్థానిక నాయకులతో కలిసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించి, మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే హామీల అమలు విషయంలో రకరకాల సాకులతో కాలం వెల్లదీస్తున్నదని మండిపడ్డారు. కొన్ని పథకాలకు ఏవేవో కొర్రీలు పెట్టి లబ్ధిదారులను తగ్గించే ప్రక్రియ ప్రారంభించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు కాంగ్రెస్ నేతలంతా అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో 6,47,479 నూతన రేషన్ కార్డులు జారీ చేసినట్లు గుర్తు చేశారు. నిరుపేదకు రేషన్ కార్డులు రావాలనే ఆలోచనతో ఆదాయ పరిమితిని సడలించారని గ్రామీణంలో రూ.60 వేల నుంచి రూ.1.50 లక్షలకు, పట్టణంలో రూ.75 వేలు నుంచి రూ.2.50 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి 6 కేజీలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు.

## కాంగ్రెస్‌కు కళ్లు తెరిపించండి

### కోతిరాంపూర్‌లోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుల వినతి

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 30 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 420 రోజులు అయినా ఇప్పటి వరకు అమలు చేయలేకపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వ కళ్లను తెరిపించి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ గురువారం స్థానిక కోతిరాంపూర్‌లోని గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడారు. తమది గాంధీల పార్టీ అని చెప్పుకునే రేవంత్‌రెడ్డికి గాంధీజీ మార్గనిర్దేశనం చేయాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతే కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతకాక ఇప్పుడు డైవర్షన్ డ్రామాలతో కాలం వెలదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి వెన్నముక అయిన రైతన్నకు వెన్నుపోటు పొడిచిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పాలకుల తీరుతో రైతులు మరోసారి ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు తెలంగాణలో కనిపిస్తున్నాయన్నారు. హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ పాలకుల మెడలు వంచి అమలు చేసే వరకు పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. అడ్డమైన నిబంధనల పేరుతో కనీసం రేషన్‌కార్డులను కూడా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు తమ తీరు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్, మండల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్, బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.





హుజూరాబాద్ టౌన్: మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, తిమ్మాపూర్‌లో..


ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి॥ రామడుగు
రి.నెం. 3783/TD
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరిధిలో గల వెదిర గ్రామము యందు (500 MTS Capacity) గల గోదాము కిరాయికి ఇవ్వబడును. అవసరమైన వారు ఆఫీస్ యందు సంప్రదించగలరు : కార్యదర్శి
సెల్ : 77027 00568



